సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



మోగింది కల్యాణ వీణ

8లో

శ్రావణ మాసం మొదలు కావడంతో శుభ కార్యాలు జోరందుకున్నాయి. జిల్లాలో ఏకంగా మూడు వేల జంటలకు ముడి పడనుందని అంచనా.



ఎయిర్‌పోర్టులో కల్చర్ వీక్

విశాఖ: విమానాశ్రయంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్‌లో భాగంగా గురువారం వాక్‌థాన్ నిర్వహించారు. డైరెక్టర్ రాజారెడ్డి పాల్గొన్నారు.



నేడు లక్ష కుంకుమార్చన

సింహాచలం: శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని సింహవల్లీతాయారు సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

ఎక్కడి వారు అక్కడే..

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీలకు బ్రేక్
- అంతవరకు పాత స్థానాల్లో కొనసాగింపు

సాక్షి, అనకాపల్లి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీలకు బ్రేక్ పడింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏ మండలాల్లో అయితే విధులు నిర్వహించారో అదే స్థానాల్లో వారిని కొనసాగించాలని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 24 మండల తహసీల్దార్లు ఎన్నికల సమయంలో విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పార్వతీపురం మన్యం, విశాఖ జిల్లాలకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఇతర జిల్లాల నుంచి అనకాపల్లి జిల్లాకు బదిలీపై వచ్చిన వారు పోస్టింగ్ లేకుండా హోల్డ్‌లో ఉండిపోయారు. అన్ని జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చినా.. అనకాపల్లి జిల్లాలో మాత్రం స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడితో పోస్టింగ్‌లు ఇవ్వడంలో జాప్యం జరిగింది. ఈలోపు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ కారణంగా జాబితా సిద్ధమైనా.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వారికి పోస్టింగ్‌లు ఇవ్వడానికి కుదర్లేదు. దీంతో పోస్టింగ్‌లకు అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ అందుకు అంగీకరించకుండా బదిలీలకు ముందు ఏ మండలంలో ఏ తహసీల్దార్ ఉన్నారో.. అదేవిధంగా కొనసాగించాలని ఆదేశించింది. దీంతో ఈమేరకు కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీలైనంత మేరకు గురు, శుక్రవారాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

17న ఎస్ఎంసీ ఎన్నికలు

- రీషెడ్యూల్ విడుదల

అనకాపల్లి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించడానికి రీషెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఎన్నిక జరగనుందని, ఈ మేరకు పాఠశాలల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాను ప్రకటించారు. అభ్యంతరాలుంటే ఈ నెల 12న తెలియజేసుకోవచ్చు. ఈనెల 17వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి ఒంటి గంటలోపు ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలని, అదేరోజు సాయంత్రం చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక, కమిటీ ప్రమాణ స్వీకారం, ఎస్ఎంసీ తొలి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సంబంధిత మండల పరిషత్ అధికారులు, తహసీల్దార్లు నిబంధల ప్రకారం ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. గ్రామాల్లో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు, కార్యదర్శులు పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పాము అడ్డు రావడంతో..

- ఏలేరు కాలువలో పడిన భార్యాభర్తలు
- భార్య మృతి.. ప్రాణాలతో బయటపడ్డ భర్త

-8లో



ఏజెన్సీ నుంచి వచ్చిన దుంప పసుపు



పసుపు పంటకు సిరుల ఛాయ

- గంజాయి వదిలి పసుపు సాగు వైపు..
- పెరుగుతున్న విస్తీర్ణం
- అంతర్జాతీయ మార్కెట్‌లో మాడుగుల పసుపునకు గిరాకీ
- ఏటా రూ.120 కోట్ల టర్నోవర్
- వెయ్యి కుటుంబాలకు జీవనోపాధి

మాడుగుల : పసుపునకు గత ఏడాది కంటే ఈ ఏడాది ధరలు పెరగడంతో మాడుగులలో పసుపు కళకళలాడుతోంది. సాగు పెంచడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేశీయ మార్కెట్‌లో మాడుగుల పసుపునకు మంచి డిమాండ్ ఉండడంతో రైతులతో పాటు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా పసుపు ధరలు పెరుగుతూ ఉండడంతో ప్రతి ఏటా రైతులు సాగు పెంచుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం ముఖద్వారమైన మాడుగుల పసుపు వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఏజెన్సీలో 11 మండలాల్లో పండించిన పసుపు, మాడుగుల, పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలకు సరఫరా అవుతుంది. గత ప్రభుత్వం ఏజెన్సీలో గంజాయి కట్టడి చేయడంతో ప్రత్యామ్నాయం వైపు చూసిన రైతులంతా పసుపు సాగుపై దృష్టి సారించారు. దీంతో ఈ ఏడాది కూడా పసుపు సాగు పెంచారు.

పసుపు ప్రాసెసింగ్

విశాఖ ఏజెన్సీలో పండించిన పసుపు దుంపలు మాడుగుల చేరాక, అక్కడ డ్రమ్ముల్లో వేసి ఉడకబెట్టి ప్రాసెసింగ్ చేస్తారు. అనేక ప్రాసెస్‌ల తర్వాత ఎల్లో నారింజ రంగుకు మారుతుంది. తర్వాత ఆకర్షణీయమైన ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పసుపు వ్యాపారంపై సుమారు 1000కి పైగా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి.

పెరుగుతున్న విస్తీర్ణం

గతంలో 3 వేల ఎకరాలకు పరిమితమైన పసుపు సాగు నేడు ధరలు పెరుగుతూ ఉండడంతో 5 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణానికి సాగు పెంచుతున్నారు. ఏజెన్సీలోని 11 మండలాల నుంచి 77 కిలోలున్న బస్తాలు 80 వేలు వచ్చేవి కానీ ఈ ఏడాది సుమారు లక్షా 40 వేల బస్తాలు వస్తాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

అంతర్జాతీయంగా గుర్తింపు

దక్షిణ భారత దేశంలో రెండు తెలుగు రాష్ట్రాలలో నర్సీపట్నం, పాలకొండ, రాజమండ్రి, వరంగల్, నిజామాబాద్, దుగ్గిరాల, తమిళనాడు, కేరళ, ఒడిశా, బరంపురంలో పసుపు పరిశ్రమలున్నాయి. మాడుగుల, తుని, నర్సీపట్నం, సాలూరులలో పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. కాని మాడుగుల పసుపునకు మాత్రం దేశీయ అంతర్జాతీయ, మార్కెట్‌లలో మంచి గిరాకీ ఉంది. విశాఖ మన్యంలో పండించే పసుపులో కుర్కుమిన్‌తో పాటు, చర్మసౌందర్యానికి ఉపయోగపడే, ఓలంటయిల్, ఉండడమే ఇందుకు కారణమని నిపుణులు చెబుతున్నారు. మిగతా ప్రాంతాల పసుపులో 2 శాతం కుర్కుమిన్ ఉంటే మాడుగుల పసుపులో మాత్రం 5 శాతం కుర్కుమిన్ ఉండడంతో పాటు రంగు ఆరంజ్ ఎల్లో కావడంతో మంచి క్రేజ్ ఉంది. నాణ్యమైన పసుపు కావడంతో సౌందర్యానికి, వివిధ రకాల వంటకాల్లో ఈ పసుపు విరివిగా వినియోగించడం వల్ల ఈ పసుపునకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

మాడుగుల పసుపులో కుర్కుమిన్ అధికం



కుర్కుమిన్ అధికంగా ఉండే పసుపు ఎక్కువగా తమిళనాడులో ఉపయోగిస్తున్నారు. ఔషధ తయారీలో కూడా ఉపయోగించడంతో మాడుగుల పసుపునకు మంచి గిరాకీ ఉంది. గతంలో కిలో పసుపు ధర రూ. 70 నుంచి 90 వరకు పలికేది. కాని గత రెండేళ్లుగా రూ.120 నుంచి 140 వరకు ధరలు పలుకుతున్నాయి. దీంతో అటు రైతులు, ఇటు వ్యాపారులకు లాభాలు వస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి అరికట్టడంతో ఏజెన్సీలో రైతులు పసుపు సాగుపై దృష్టి సారించారు. ఏటా సాగు పెంచడంతో దిగుబడి మెరుగుపడి వ్యాపారాలు కూడా పెరుగుతున్నాయి.

– శ్రీనాదు శ్రీనివాసరావు, పసుపు వ్యాపారి

గురుకులాల్లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు



సబ్బవరం : అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల /కళాశాలల్లో పలు సబ్జెక్టుల్లో బోధించడానికి ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్, నకలు ధ్రువపత్రాలతో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమో తరగతులకు హాజరుకావాలన్నారు. ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో ప్రోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా బాలుర పాఠశాలలకు పురుష అభ్యర్థులను, బాలికల పాఠశాలకు మహిళా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని, విద్యా బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి కార్యాలయాన్ని ఫోన్ :0891 2799641 నంబర్‌లో సంప్రదించాలన్నారు. దేవరాపల్లి బాలుర గురుకుల పాఠశాలలో జేఎల్ తెలుగు, కొక్కిరాపల్లి బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ జువాలజీ, కోనాం బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ కెమిస్ట్రీ , నర్సీపట్నం బాలికల గురుకులంలో పీజీటీ సోషల్ సబ్జెక్టు పోస్టులతో పాటు గొలుగొండ బాలుర గురుకులంలో పీడీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

స్వాతంత్య్ర వేడుకలకు విస్తృత ఏర్పాట్లు





జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- దేశభక్తి పెంపొందించేలా కార్యక్రమాలు
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

తుమ్మపాల: స్వాతంత్య్ర దినోత్సవం రోజున స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న వేడుకలకు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించాలని, సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాల్స్ ఏర్పాటుకు ఆయా విభాగాల పరిధిలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈనెల 15న ఉదయం 9 గంటల నుంచి జరిగే వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులతోపాటు అందరూ ఆహ్వానితులేనన్నారు. వేదిక అలంకరణ, సీటింగ్, స్టాల్స్ ఏర్పాటు, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు పనులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పైలెట్ వాహనం ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలన్నారు. ముందుగానే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలన్నారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాలు వందన సమర్పణ, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించి, సమన్వయం చేసుకోవాలన్నారు. వేడుకలకు వచ్చే అతిథులకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులందరూ సంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి వేడుకలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విజయ భాస్కర్, ఇన్‌చార్జి డీఆర్వో వై.శ్రీనివాసరావు, ఆర్డీవో చిన్నికృష్ణ, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగపుత్రులపై పచ్చ నేతల ప్రతాపం

- హేచరీల్లో పాగా వేసేందుకు పన్నాగం
- తమకు అనుకూలం కానివారి పొట్టకొట్టే యత్నం
- ప్యాకింగ్ ఏజెన్సీలు తమకే ఇవ్వాలని యాజమాన్యాలపై ఒత్తిడి
- జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామంటున్న మత్స్యకార నేత మోసా అప్పలరాజు



టీడీపీ నాయకుల దౌర్జన్యాలను వివరిస్తున్న మోసా అప్పలరాజు

నక్కపల్లి: టీడీపీ నాయకులు అధికారం చేతికి రాగానే మత్స్యకారులు, రోజువారీ కూలీలపై ప్రతాపం చూపిస్తున్నారు. చాలా కాలం నుంచి కొనసాగుతున్న కమీషన్ ఏజెన్సీలు తమకే దక్కాలని, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ వారికి ఇవ్వకూడదని ఆంక్షలు పెడుతున్నారు. తమ వ్యతిరేకులకు పనుల్లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారు నెలరోజుల నుంచి ఏజెంట్లను పనుల్లోకి రాకుండా, వారికి ఏజెంట్ కమీషన్ ఇవ్వకుండా అడ్డుకుంటున్న టీడీపీ నేతల ఆగడాలను జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు వివరించారు. గురువారం ఆయన మోసయ్యపేటలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి టీడీపీ ప్రభుత్వం ఆరాచకాలను ఏకరువు పెట్టారు. ఈ సమావేశంలో పలువురు బాధితులతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల నుంచి మండలంలోని తీర ప్రాంతాల్లో హేచరీల ఏర్పాటుకు ఈ ప్రాంత మత్స్యకార నాయకులుగా తాము ఎంతో కృషి చేశామన్నారు. ఈ హేచరీల్లో ప్యాకింగ్ ఏజెన్సీ పనులు స్థానికంగా ఉన్న మత్స్యకారులు, యాదవ సామాజిక వర్గానికి చెందినవారికి ఇచ్చామన్నారు. 660 మందికి పైగా స్థానిక మత్స్యకారులు ఈ హేచరీల్లో ప్యాకింగ్ పనులు చేసుకొని జీవిస్తున్నారన్నారు. ప్రతి 30 మంది కూలీలకు ఒక ఏజెంట్ ఉంటారని, కూలీలకు ఇచ్చే వేతనాల్లో ఒక భాగం ఏజెంటుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇలా చాలామంది ఏజెంట్ కమీషన్‌పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వేట నిషేధ సమయంలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు వేట లేకపోవడంతో ఈ హేచరీల్లో ప్యాకింగ్ పనులే ప్రధాన జీవనాధారమయ్యాయన్నారు. మత్స్యకారులతోపాటు యాదవులు, ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు కూడా ఈ ప్యాకింగ్ పనులకు వెళ్తూ జీవనోపాధి పొందేవారన్నారు.

ప్రభుత్వం మారడంతో మారిన స్థితిగతులు

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయని, మండలానికి చెందిన కొంతమంది పార్టీ నాయకులు, మత్స్యకారుల్లో టీడీపీకి చెందినవారు.. హేచరీల్లో కాంట్రాక్ట్ ఏజెన్సీలను తమ వర్గీయులకే ఇవ్వాలని, వేరొక పార్టీ వారికి ఏజెంట్ కమీషన్ ఇవ్వడానికి వీల్లేదని హుకుం జారీ చేస్తున్నారని అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. వారి ద్వారా వచ్చే కూలీలను ప్యాకింగ్ పనుల్లోకి తీసుకోడానికి వీల్లేదంటూ హేచరీ యాజమాన్యాలను హెచ్చరిస్తున్నారన్నారు. ప్యాకింగ్ పనుల్లోకి వెళ్లే మత్స్యకారులు, యాదవ వర్గానికి చెందిన ఏజెంట్లపై కేసులు పెడతామని, రౌడీషీట్లు తెరుస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికార పలుకుబడితో హేచరీ యాజమాన్యాలను బెదిరించడంతో వారంతా భయభ్రాంతులకు గురవుతున్నారని వైఎస్సార్‌సీపీ వర్గీయులకు ఏజెన్సీలు ఇవ్వడానికి వెనుకాడుతున్నారన్నారు. టీడీపీకి ఓటెయ్యలేదన్న అక్కసుతోనే ఆ పార్టీ నాయకులు ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకుల నిర్వాకం వల్ల మండలంలో మోసయ్యపేట, కొర్లయ్యపేట, రాజయ్యపేట, పాల్మన్‌పేట ప్రాంతాల్లో సుమారు 400మందికి పైగా మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఎదురయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఎస్పీ, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వీరి నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. దీంతో బాధితుల తరపున జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి కల్పించే హేచరీలు రావడానికి కృషి చేయకపోగా.. అధికారాన్ని ఉపయోగించి ఉన్న హేచరీల్లో దౌర్జన్యాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సింహాద్రికి గ్రీన్ సిగ్నల్

- మరో ఐదు రైళ్ల సర్వీసులకు కూడా..
- సాక్షి కథనానికి రైల్వే అధికారుల్లో కదలిక
- దిగొచ్చిన దక్షిణ మధ్య రైల్వే



విశాఖ సిటీ: పేదవాడి రైళ్లు మళ్లీ పట్టాలెక్కనున్నాయి. ఆరు నెలలుగా నడవని సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూత పెట్టనుంది. 50 రోజులుగా నిలిపేసిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖ నుంచి మళ్లీ పరుగులు తీయనుంది. 'వాల్తేరుపై పగ' శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనానికి రైల్వే అధికారుల్లో కదలిక వచ్చింది. రద్దు చేసిన ఆరు రైలు సర్వీసులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఫలితంగా ప్రయాణికులకు ఎంతో ఊరట కలగనుంది.

వాల్తేరుపై చిన్నచూపు

ఆదాయంలో దూసుకుపోతున్న వాల్తేరు డివిజన్‌పై రైల్వే ఉన్నతాధికారులకు చిన్నచూపే ఉంది. ఒకవైపు దక్షిణ మధ్య రైల్వే, మరోవైపు తూర్పు కోస్తా రైల్వే డివిజన్ అధికారులు వాల్తేరుపై పగ పట్టినట్లు వ్యవహరిస్తున్నారు. డివిజన్‌లో అత్యధికంగా ఆదాయం వచ్చే విశాఖ నుంచి రైళ్ల మళ్లింపు, రద్దు నిర్ణయాలు తీసుకుంటుండడం అందరికీ విస్మయాన్ని కలిగిస్తోంది. విశాఖలో ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటును జాప్యం చేస్తూ వస్తున్న కేంద్ర ప్రభుత్వం.. విశాఖ నుంచి రైళ్ల మళ్లింపు, రద్దు నిర్ణయాలకు అడ్డుకట్ట వేయకపోవడం గమనార్హం. ఆదాయం దెబ్బకొట్టడానికి ఒకవైపు దక్షిణ మధ్య రైల్వే, మరోవైపు తూర్పు కోస్తా రైల్వే అధికారులు ఎప్పటికప్పుడు వాల్తేరు డివిజన్‌కు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూనే ఉన్నారు. ప్రత్యేక జోన్ ఏర్పాటుకు చేసే కీలక నిర్ణయాల్లో సైతం అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి.

11 నుంచి సర్వీసుల పునరుద్ధరణ

దక్షిణ మధ్య రైల్వే పలు ఎక్స్‌ప్రెస్‌లను విశాఖ వైపు నడుపుతోంది. వీటిలో సింహాద్రి, రత్నాచల్, మచిలీపట్నం ఇలా ప్రతి ఎక్స్‌ప్రెస్ అత్యధిక ఆక్యుపెన్సీతో నిత్యం నడిచేవి. కానీ సాంకేతిక కారణాలు చూపించి ఈ సర్వీసులను నిలిపివేశారు. విశాఖ నుంచి ఉదయం సమయాల్లో నడిచే ఈ రైళ్లలో ఉద్యోగులే అత్యధికంగా ప్రయాణించే వారు. టికెట్ ధరలు తక్కువగా, ప్రయాణ వేళలు అనుకూలంగా ఉండడంతో విశాఖ-విజయవాడ మధ్యలో పనులు, వ్యాపారాలు చేసుకొనే వారు సైతం ఈ రైళ్లను ఆశ్రయించేవారు.

అయితే పట్టాల మరమ్మతులు, ఆధునికీకరణ పేరుతో కొద్ది నెలల క్రితం ఈ సర్వీసులను నిలిపివేశారు. దీనిపై వాల్తేరు డివిజన్ అధికారులు పలుమార్లు ఆయా డివిజన్ అధికారులకు లేఖలు రాసినా స్పందించలేదు. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే నిర్ణయాలపై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవడంతో ఆయా డివిజన్ అధికారులు దిగొచ్చారు. సింహాద్రి, ఉదయ్, రత్నాచల్, గుంటూరు–రాయగడ, తిరుపతి డబుల్ డెక్కర్, విశాఖ–మచిలీపట్నం రైళ్లను పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఈ రైళ్లు పట్టా లెక్కనున్నాయి.

అయితే విశాఖ–బెంగుళూరు వీకెండ్, విశాఖ–కర్నూలు సిటీ స్పెషల్, విశాఖ–రాజమండ్రి మెము రైలుకు మోక్షమెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. విశాఖ నుంచి బెంగుళూరుకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది. అయినా ఈ సర్వీసులను పునరుద్ధరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

పునరుద్ధరణకు నోచుకోనివి
విశాఖ - బెంగుళూరు
విశాఖ - కర్నూలు సిటీ స్పెషల్
విశాఖ - రాజమండ్రి మెము

పునరుద్ధరించిన రైళ్లు
సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (విశాఖ-గుంటూరు) (17239/40)
డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (విశాఖ-గుంటూరు) (22701/02)
రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (విశాఖ- విజయవాడ) (12717/18)
గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (57271)
విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707/08)
విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220)

క్లుప్తంగా

పాము అడ్డు రావడంతో.. ఏలేరు కాలువలో పడిన భార్యాభర్తలు

- భార్య మృతి.. ప్రాణాలతో బయటపడ్డ భర్త



భార్య మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త

మాకవరపాలెం: పాము అడ్డు రావడంతో బైకుతో సహా ఏలేరు కాలువలో పడిన ఘటనలో భార్య మృతి చెందగా, భర్త ప్రాణాలతో బయటపడ్డాడు. విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన కోటిపల్లి నాగేశ్వరరావు, భార్య పాపారత్నంతో కలసి గురువారం నర్సీపట్నం వచ్చారు. తిరిగి రాత్రి బైక్‌పై పెందుర్తి బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని కొండల అగ్రహారం వద్ద ఏలేరు కాలువ సమీపానికి వచ్చేసరికి పాము రోడ్డుకు అడ్డంగా వచ్చింది. దాంతో అదుపు తప్పి భార్యాభర్తలిద్దరూ బైకుతో సహా ఏలేరు కాలువలో పడిపోయారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు ప్రాణాలతో బయటపడ్డాడు. పాపారత్నం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి కొంత దూరంలో మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి పాపారత్నం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్పేస్ టెక్నాలజీపై నేడు వర్క్‌షాప్

మహారాణిపేట : బీచ్‌రోడ్డులోని ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్‌ఎస్‌ఐ) కార్యాలయంలో శుక్రవారం అప్లికేషన్స్ స్పేస్ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. సైంటిస్టు రిమోట్ సెన్సింగ్ ద్వారా సముద్ర డొమైన్‌లు, సంభావ్య ఫిషింగ్ జోన్‌ల కోసం కమ్యూనికేషన్ /నావిగేషన్‌పై ఉపన్యాసాలు, ఫిషింగ్ ఓడలపై అమర్చాల్సిన ట్రాన్స్‌పాండర్లపై ప్రదర్శన చేయనున్నారు.



మోగింది కల్యాణ వీణ

- నేటి నుంచి వివాహ శుభ ముహూర్తాలు
- మూడు నెలల తర్వాత మొదలైన పెళ్లిసందడి
- జిల్లాలో ఏకం కానున్న మూడువేల జంటలు
- పలువురికి చేతి నిండా పని, దండిగా ఆదాయం

పెళ్లంటే..

పెళ్లంటె పందిళ్లు సందళ్లు తప్పెట్లు.. తాళాలు తలంబ్రాలూ.. మూడే ముళ్లు, ఏడే అడుగులు మొత్తం కలిపి నూరేళ్లు.. అన్నాడో సినీ కవి. జిల్లాలో పెద్దల సాక్షిగా శుభముహూర్తాన ఒక్కటయ్యేందుకు సిద్ధపడ్డ సుమారు 3 వేల జంటలు ఎదురుచూసిన శుభ ఘడియలు వచ్చేశాయి. శ్రావణమాసం ప్రారంభం నుంచే పల్లె, పట్టణాలు కల్యాణ శోభతో కళకళలాడుతున్నాయి. శ్రావణ తొలి శుక్రవారం జిల్లాలో ఎక్కువగా పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో ఊరూవాడా పెళ్లి పనుల సందడి, సన్నాయి మోతలు మొదలయ్యాయి.



వివాహానికి సిద్ధం చేస్తున్న ఓ కల్యాణ మండపం

యలమంచిలి రూరల్: మూఢమి కారణంగా మూడు నెలలుగా ముహూర్తాల్లేక వాయిదా పడిన వివాహాలు ఎట్టకేలకు మొదలయ్యాయి. శుక్రవారం మంచి ముహూర్తం కావడంతో ఎక్కువ జంటలు పెళ్లిపీటలు ఎక్కనున్నాయి. ఈ నెలాఖరు వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. దీంతో జిల్లాలోని అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం, అచ్యుతాపురం, పాయకరావుపేట సహా మండల కేంద్రాల్లోని ఫంక్షన్ హాళ్లు బుకింగ్స్‌తో బిజీగా అయ్యాయి. ఫంక్షన్ హాల్ దొరకనివారు ఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో పందిరి వేసి, తమ స్థాయి మేరకు హడావుడి చేస్తూ పెళ్లికి సిద్ధమవుతున్నారు.

శుభ ముహూర్తాలు ఇవే..

శ్రావణమాసం ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైనా, 9వ తేదీ నుంచే ఎక్కువగా వివాహాలు జరుగుతున్నాయి. శ్రావణ మాసం సెప్టెంబరు 3తో ముగుస్తుంది. అమావాస్య ముందు ఈ నెల 31 వరకే శుభకార్యాలకు అనువుగా ఉంటుందని పురోహితులు చెబుతున్నారు. ఈ నెల 7 నుంచి 11, 15 నుంచి 18, 21 నుంచి 24, 28 తేదీల్లో వివాహ ముహూర్తాలున్నాయి. సెప్టెంబర్ 3 నుంచి శూన్యమాసం కారణంగా అక్టోబర్ 2 వరకు శుభ ముహూర్తాల్లేవు. మళ్లీ ఆశ్వీయుజంలో(అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 26 వరకు) ముహూర్తాలున్నాయి. డిసెంబర్ 31 నుంచి 2025 జనవరి 29 వరకూ పుష్య మాసం కావడంతో శుభ ముహూర్తాలుండవు. దీంతో ఆగస్టు నెలలో ఉన్న శుభ ముహూర్తాల్లో జిల్లాలోని సుమారు 3 వేల జంటలు పెళ్లి పీటలెక్కనున్నట్లు పురోహితులు చెప్తున్నారు.

చేతినిండా పని.. దండిగా ఆదాయం

గృహప్రవేశాలు, వివాహశుభ ముహూర్తాలతో ఈ నెల్లో చాలా మందికి చేతి నిండా పని దొరకనుంది. దీంతో పాటు దండిగా ఆదాయాన్ని కూడా ఆర్జించనున్నారు. పురోహితులు, బ్యాండు మేళం, ఫోటో, వీడియో గ్రాఫర్లు, ఈవెంట్ల నిర్వాహకులు, ప్రింటింగ్ ప్రెస్, బట్టలు, నగలు, కిరాణా, పండ్లు, పూలు, టెంట్ హౌస్, క్యాటరింగ్, కల్యాణ మండపాల నిర్వాహకులు శ్రావణ ముహూర్తాలకు రెడీ అయ్యారు. బ్యూటీ పార్లర్లు పెళ్లివారితో రద్దీగా మారాయి. శుక్ర మౌఢ్యమి, ఆషాఢం, గురు మౌఢ్యమి కారణంగా 3 నెలల పాటు ఖాళీగా ఉన్న వీరంతా ఇప్పుడు బిజీ అయ్యారు.

ఈ నెలలోనే మంచి ముహూర్తాలు



ఈ ఏడాది వివిధ కారణాల వల్ల వివాహ ముహూర్తాలు కాస్త తక్కువగా ఉన్నాయి. ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో ఎక్కువ జంటలు ఈ నెల్లోనే ఏకమవుతున్నాయి. ఆగస్టు ముహూర్తాలు దాటితే మళ్లీ నెల రోజుల వరకు మంచి ముహూర్తాల్లేవు. గృహప్రవేశాలు, ఇతర శుభ కార్యాలకు కూడా ఈ నెలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

– కాలనాథభట్ల వెంకటేష్ శర్మ, వేద పండితుడు, యలమంచిలి

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళి



భట్టాచార్య చిత్ర పటం వద్ద సంతాపం ప్రకటిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సంతాప సభ స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగింది. భట్టాచార్య చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో ఉంటూ మార్క్సిస్టు పార్టీ నిర్మాణంలో భాగస్వామిగా, అంచెలంచెలుగా భట్టాచార్య ఎదిగారన్నారు. జ్యోతిబసు నాయకత్వంలోని క్యాబినెట్లో పలు మంత్రి పదవులతో పాటు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారని తెలిపారు. బెంగాల్ సీఎంగా 2000 నుంచి 2011 వరకు గొప్ప పాలన అందించారని కొనియాడారు. సీఎం గద్దె దిగాక పెద్ద బంగ్లా తీసుకోవాలని కోరినా, ప్రభుత్వ క్వార్టర్స్‌లోని రెండు గదులు ఇంట్లోనే తుది శ్వాసవరకూ నివాసం ఉన్నారని, నేటి ప్రజాప్రతినిధులకు ఆయన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, పెంటకోట శ్రీను తాతయ్యబాబు, మల్లికార్జున, ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశు గణనతో జంతు సంక్షేమానికి కృషి



21వ పశు గణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, అధికారులు

తుమ్మపాల: జిల్లాలో 2.34 లక్షల కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయని, జంతు సంక్షేమమే లక్ష్యంగా అందరూ పని చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులకు సూచించారు. 21వ పశుగణనపై డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్లను, సూచనల మాన్యువల్, సెన్సస్ షెడ్యూల్‌ను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. ఒక దేశం గొప్పతనాన్ని అక్కడి జంతువులను చూసే విధానం ద్వారా అంచనా వేయవచ్చన్న మహాత్మా గాంధీ మాటల్ని ఉటంకిస్తూ, ఆగస్టు 6, 7, 8 తేదీల్లో పశుగణనపై నిర్వహించిన ఎన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.బెహరా ప్రసాదరావు మాట్లాడుతూ ఒంగోలు జాతి పశువులు, నెల్లూరు జాతి గొర్రెలు తదితర పశు సంపదలో రాష్ట్ర ఘనతను కొనియాడారు. జిల్లా నోడల్ అధికారి డా.గణేష్ ఎన్యుమరేటర్లకు ఖచ్చితమైన వివరాల సేకరణ, అధునాతన సాఫ్ట్‌వేర్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అన్ని మండలాల ఎన్యుమరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణలో రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు

నర్సీపట్నం: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించి, న్యాయం చేయాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి పాపారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 5 శాతం రిజర్వేషన్ కల్పించకపోతే న్యాయ పోరాటం చేయనున్నట్లు హెచ్చరించారు. పోరాటానికి రెల్లి కులస్తులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అన్ని రంగాల్లో వెనుకబడిన రెల్లి కులస్తులకు కనీసం 5 శాతం రిజర్వేషన్ ఇచ్చినపుడే సమన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సమితి నాయకులు వరప్రసాద్, అప్పారావు, సూరిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అధికార పార్టీకి ఎన్నికల కోడ్ వర్తించదా...!



కొత్తకోటలో మెయిన్‌రోడ్డుపై అధికార పార్టీ ఫ్లెక్సీలు, కటౌట్లు

చోడవరం: ఎన్నికల నిబంధనలు పాటించడంలో కొందరు అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. గత నెల 30 నుంచి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ కొందరు అధికారులు నిబంధనలు పాటించడంలేదు. కోడ్ ఉన్న ప్రాంతాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లు ఉంచరాదు. రాజకీయ నాయకుల విగ్రహాలను సైతం మూసివేసి ఉంచాలి. కానీ చోడవరం నియోజకవర్గంలో ఈ నిబంధనలేవీ అధికారులు పాటించడంలేదు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లోని అన్ని గ్రామాల్లోనూ ఎక్కడ పడితే అక్కడ అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, కటౌట్లు పెద్దపెద్దవి ఉన్నా వాటిని తొలగించలేదు. కొన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు సైతం ముసుగు వేయలేదు.

సోదరుడిపై కత్తితో దాడి



కత్తి దాడిలో గాయపడిన సుబ్బారావు

ఎస్.రాయవరం : ఇంటి ఆస్తి విషయమై గురువారం అన్న, తమ్ముడిపై కత్తితో దాడిచేసి గాయపరచాడు. ఎస్‌ఐ విభీషణరావు అందించిన వివరాలివి. పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన కట్టా అప్పారావు, కట్టా సుబ్బారావు అన్నదమ్ములు ఒకే ఇంట్లో వేరు వేరు గదుల్లో నివసిస్తున్నారు. సుబ్బారావు ఉంటున్న గది కూడా తనకు చెందినదని తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో సుబ్బారావు గదిలో గురువారం మధ్యాహ్నం నిద్రిస్తుండగా అప్పారావు కూరగాయల కత్తితో దాడిచేశాడు. సుబ్బారావుకు మెడ వద్ద స్వల్పగాయమైంది. త్రుటిలో ప్రాణపాయ స్థితి తప్పింది. ఇది గమనించిన స్థానికులు అప్పారావుని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన సుబ్బారావుని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే క్రమంలో సుబ్బారావు కుటుంబ సభ్యులపై కూడా గతంలో పెట్రోలుతో దాడి చేసినట్టు పోలీసులకు చెప్పారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు.

'ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల పింఛన్ పెంచాలి'



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్

నర్సీపట్నం: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం కనీసం రూ.10 వేల పింఛన్ అందించి ఆదుకోవాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.2 వేలకు మించి పెన్షన్ రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొరగా ఇస్తున్న పెన్షన్‌తో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి కనీసం వృద్ధాప్య పెన్షన్ ద్వారానైనా ఆదుకోవాలన్నారు. వారికి రేషన్ కార్డులు కూడా ఇప్పించాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి ఎ.వి.రావు, డిపో కార్యదర్శులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ అనలిటికల్ కెమిస్ట్రీ కోర్సు



ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్

యలమంచిలి రూరల్ : యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మరో కొత్త పీజీ కోర్సుకు అనుమతినిస్తూ రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలాభాస్కర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ గురువారం మీడియాకు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఎమ్మెస్సీ అనలిటికల్ కెమిస్ట్రీ కోర్సులో విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ కోర్సుకు సంబంధించి 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థుల్లో అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుందన్నారు. ఇప్పటికే తమ కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంకాం కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పీజీ కోర్సులు అందుబాటులోకి తేవడానికి తాము కృషి చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని ఆయన సూచించారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి రాక

మహారాణిపేట: కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే శుక్రవారం విశాఖ వస్తున్నారు. న్యూఢిల్లీ నుంచి రాత్రి 10.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొని రాత్రి అక్కడ బస చేస్తారు. 10న ఉదయం 7.45 గంటలకు కోరాపుట్ బయలుదేరుతారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి 9 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఇక్కడ నుంచి రాత్రి 10.30గంటలకు విమానంలో ఢిల్లీ వెళ్తారు.

హోంగార్డు కుటుంబానికి ఒక రోజు వేతనం

- రూ.3.83 లక్షల చెక్కు అందజేసిన ఎస్పీ



మృతుడు శ్రీనివాసరావు భార్య తులసీరామలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్లో పదవీ విరమణ పొంది ఇటీవల మృతి చెందిన జి.శ్రీనివాసరావు కుటుంబానికి హోంగార్డులు ఒక రోజు వేతనంగా వితరణగా అందించారు. ఈ మేరకు అతని భార్య తులసి రామలక్ష్మికి రూ.3,83,400 చెక్కును స్థానిక జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో హోంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించినా లేదా పదవీ విరమణ పొందినా వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న హోంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ స్వచ్ఛందంగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏవో బి.శారద, సూపరింటెండెంట్ వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

చోడవరం రూరల్: గవరవరం పీహెచ్‌సీ పరిధిలోని ముద్దుర్తి ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌పోర్స్ బృందం గురువారం ఆకస్మిక తనిఖీ చేసింది. జిల్లా డీపీవో డాక్టర్ లూసీ విక్టోరియా ఆధ్వర్యంలో టాస్క్‌పోర్స్ టీం సభ్యులు గణాంకాధికారి రామచంద్రరావు, డీపీవో జగదీష్, కోఆర్డినేటర్ జనార్దన్ రోగులను కలిసి, సేవలపై ఆరా తీశారు. శాఖల వారీగా సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ లూసీ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్యకు గురవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణుల ప్రసవాలు ఆరోగ్య కేంద్రంలోనే జరిగేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రవి, హెచ్‌వీ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

- వచ్చే నెల 6 తుది గడువు

అనకాపల్లి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్ 2024-25) పరీక్షకు హాజరయ్యేందుకు జిల్లాలోని 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష రాసేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలు దాటనివారు మాత్రమే అర్హులన్నారు.

పరీక్ష ఈ ఏడాది డిసెంబర్ 8న జరుగుతుందన్నారు. పరీక్ష రుసుముగా ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించి, దరఖాస్తులను ఆన్‌లైన్లో వచ్చే నెల 6వ తేదీలోగా పంపించాలన్నారు. పరీక్ష ఫీజును ఎస్‌బీఐ లింక్ ద్వారానే చెల్లించాలని సూచించారు. వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

సముద్రంలో మునిగిన బోటు

- ఇంజిన్ పాడవడంతో ప్రమాదం
- సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులు
- బోటు యజమానికి రూ.20 లక్షల నష్టం




ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో మత్స్యశాఖ జేడీ విజయ



మునిగిపోయిన మరబోటు

మహారాణిపేట: విశాఖ తీరానికి సమీపంలో గురువారం సాయంత్రం మరబోటు మునిగిపోయింది. ఉదయం ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు వెళ్లిన వీ5-ఎంఎం-529 బోటు ఇంజిన్ మరమ్మతులకు గురైంది. ఈ పరిస్థితుల్లో బోటును ఏదో విధంగా ఒడ్డుకు చేరుద్దామని అందులో ఉన్న మత్స్యకారులు వాసుపల్లి అప్పన్న, వాసుపల్లి లక్ష్మయ్య, వి.రాజు, వి.పార్వతయ్య, అప్పారావు ప్రయత్నించారు. అయితే బోటులోకి నీరు ప్రవేశించడంతో ఆందోళనకు గురయ్యారు. నీటిని తోడేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. సాయంత్రం ఐదు గంటల సమయంలో నీటిలో బోటు మునిగిపోతుండటంతో సముద్రంలో దూకేశారు. ఇది గమనించిన సమీపంలో బోట్లలో మత్స్యకారులు అక్కడకు చేరుకున్నారు. ఇందులో కొందరు ఆ బోట్లు ఎక్కగా.. మరి కొందరిని లైఫ్‌గార్డులు రక్షించారు. మునిగిన బోటు తీరం దగ్గరల్లోకి కొట్టుకొచ్చింది. ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులను మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ పరామర్శించారు. బోటును పరిశీలించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేడీ తెలిపారు. బోటు యాజమాని వాసుపల్లి రాజుకు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు.

'కృష్ణా, గోదావరి జలాలపై మన హక్కుల్ని పరిరక్షించాలి'



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ, జిల్లా రైతు సంఘం నాయకులు

తుమ్మపాల: కృష్ణ, గోదావరి నదీ జలాల పునఃపంపిణీ ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులను కాపాడాలని జిల్లా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం, సీపీఐ నాయకులు మాట్లాడుతూ నదీ జలాల హక్కుల అంశమై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాలపై మన హక్కుల్ని పరిరక్షించుకునేలా వివరించాలన్నారు. ఆగస్టు రెండో వారంలోపు ప్రభుత్వం ఈ మేరకు కమిటీకి నివేదిక అందించాలన్నారు. కృష్ణా, గోదావరి నదులకు చివరి రాష్ట్రమైనందున వరదలు, వర్షపాతం సమయంలో రైతాంగం నష్టపోయే పరిస్థితుల్ని పేర్కొని, పరిహారానికి కృషి చేయాలన్నారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకు అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ సహకరించాల్సిందిగా కోరారు.

నిరసనలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రా బాబు, ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, రైతు సంఘం కార్యవర్గ సభ్యులు గురుబాబు, కొరిబిల్లి శంకరరావు, పప్పల ఈశ్వరరావు, రైతు సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రావణ శుక్రవారం పూజలకు ఆలయాల ముస్తాబు

అనకాపల్లి: పట్టణ, మండల పరిధిలోని పలు దేవాలయాల్లో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సతకంపట్టు కనకదుర్గమ్మ, మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణపురం కొండపై కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కుంకుమ పూజలు జరపనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

కశింకోట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కశింకోట ప్రాంతంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి రైతులు, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం వంకాయ మినహా మిగిలిన కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో వంకాయలు రూ.80కి విక్రయించారు. పాదు చిక్కుడు, క్యాప్సికం, పచ్చిమిర్చి కూడా ఇదే ధరకు విక్రయించారు. టమాటా, ఉల్లిపాయ, బంగాళాదుంప, దొండకాయ, బీట్రూట్, క్యారెట్ రూ.40, బరబాటి, చేమ దుంపలు రూ.60కి అమ్మకాలు జరిగాయి.

పేద గవర విద్యార్థులకు ఉపకారవేతనాలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీసేవాసంఘం ఆధ్వర్యంలో గవర కుల పేద విద్యార్థులకు ఉపకార వేతనాల కోసం అర్హులు సెప్టెంబర్ 3లోగా దరఖాస్తు చేసుకోవాలని సంఘ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఏడాదికి పాలిటెక్నిక్, ఐఐటీ, ఈసెట్, ఇంజినీరింగ్, మెడిసిన్, బీడీఎస్, ఐఐటీ, నీట్ మొదలగు టెక్నికల్ కోర్స్ ప్రవేశపరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన జిల్లా పరిసర ప్రాంతాల గవర పేద విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఉపకార వేతనాలు తీసుకున్న విద్యార్థులు రెన్యువల్ కోసం కూడా సెప్టెంబర్ 3లోగా దరఖాస్తుల్ని తమ కార్యాలయంలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 9291445574 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 104 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	--	--
మూడోరకం	3,100	3,350

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/S కాదల్	: రాజా (మార్నింగ్, ఫస్ట్ షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్ షో)
కల్కి 2898ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
తిరగబడరస్వామి	: వెంకటేశ్వర
సూపర్ డీలక్స్	: శ్రీసత్య
భవనమ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–2 యూనిట్లు, బీ పాజిటివ్–10 యూనిట్లు, ఓ పాజిటివ్–14 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 376 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

గణిత బోధనలో ఆదర్శ 'మూర్తి'

అది కశింకోట మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్. పిల్లల మైండ్ ఫ్రెష్‌గా ఉంటుందని సాధారణంగా ఉదయం తొలి పీరియడ్ గణితం ఉంటుంది. అయితే ఆ రోజు 8, 9, 10వ తరగతుల పిల్లలు ప్రార్థన ముగిశాక ఎగ్జామ్ ప్యాడ్, నోట్ బుక్స్‌తోపాటు చేతిలో కొలత టేపు, మార్కింగ్ కర్రలు పట్టుకుని స్కూల్ నుంచి బయల్దేరారు. గ్రామానికి చెందిన పంట పొలాల వద్దకు చేరారు. ఇంకేముంది టేపు పట్టుకుని గట్ల వెంబడి కొలతలు తీయడం మొదలెట్టారు. ఒకడు రెక్టాంగిల్ అంటాడు. ఇంకో విద్యార్థిని ఆల్‌మోస్ట్ స్క్వేర్ అంటోంది. మరొకడు మొత్తం 45 సెంట్లు అంటున్నాడు. ఇదంతా ఆ స్కూల్ పిల్లల్లో గణిత పాఠ్యాంశాల పట్ల క్షేత్ర స్థాయి అవగాహన పెంచేందుకు గణిత ఉపాధ్యాయుడు చేపట్టిన ఫీల్డ్ విజిట్.

- పరిసరాల ఆధారంగా పాఠ్యాంశాలపై అవగాహన
- క్షేత్రస్థాయి బోధనతో ఆకట్టుకుంటున్న గణితం మాస్టారు
- వినూత్నంగా వెదురుపర్తి హైస్కూల్ మ్యాథ్స్ టీచర్ బోధన



పంట పొలాల్లో గణిత పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయుడు ఏవీఎన్ మూర్తి

కశింకోట: విద్యా బోధన కేవలం తరగతి గది నాలుగు గోడలకే పరిమితమైన అంశం కాదు. కాస్త మనసుపెట్టి ఆలోచించాలేగాని.. మన చుట్టూ ఉన్న పరిసరాలు పాఠ్యాంశాలుగా కళ్ల ముందు ప్రత్యక్షమవుతాయి. 'ఇవి కూడా మా టెక్స్ట్ బుక్ లెసన్స్‌లోనే ఉన్నాయా? అయ్యో.. ఇన్నాళ్లూ అస్సలు ఆలోచించలేదే'అని విద్యార్థులు తెగ హా..శ్చర్యపోతారు! అందుకు కావాల్సింది ఉపాధ్యాయుల్లో నిబద్ధత. ఆ కోవలోనే కశింకోట మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు ఏవీఎన్ మూర్తి నడుస్తున్నారు. విద్యార్థులకు గణిత పాఠ్యాంశాలపై ప్రాక్టికల్ జ్ఞానం పెంచేందుకు తన వంతు కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే విద్యార్థులను వ్యవసాయ క్షేత్రాలకు తీసుకెళ్లి ప్రత్యక్ష అనుభవంతో గణితంలో ప్రధాన అంశాలపై అవగాహన పెంచుతున్నారు.

పొలాల ఆకృతులే పాఠ్యాంశాలు

గణిత పాఠ్యాంశాల్లో హెక్టార్లు, ఎకరాలు, సెంట్లు, చదరపు గజాల లెక్కలు సర్వసాధారణం. హెక్టార్‌కు 2.47 ఎకరాలు, ఎకరానికి 100 సెంట్లు, ఒక సెంటుకు సుమారు 48 గజాలు, దీర్ఘచతురస్రం(రెక్టాంగిల్), చతురస్రం(స్క్వేర్), త్రిభుజం(ట్రయాంగిల్) ఇలా బోర్డు మీద చెప్పుకుంటూ పోవడమే ఇన్నాళ్లూ చేసేది. ఈ మూస పద్ధతికి చాలా మంది విద్యార్థులు ఏదో వింటున్నాంలే.. అన్నట్టుగా ఉంటారు.

దీనికి భిన్నంగా గణిత మాస్టారు ఏవీఎన్ మూర్తి తనకున్న పరిధిలో ప్రయత్నించారు. హైస్కూల్లోని పెద్ద(8–10) తరగతుల పిల్లలకు గణిత పాఠ్యాంశాల పట్ల మరింత ఆసక్తిని పెంచాలనుకున్నారు. అందులో భాగంగానే గత వారం వారిని సమీపంలోని వ్యవసాయ క్షేత్రాలకు తీసుకెళ్లారు. అక్కడ ఖరీఫ్ వరి నాట్ల తీరు, పంట పొలాల విస్తీర్ణం, పొలాల ఆకృతుల ఆధారంగా దీర్ఘ చతురస్రాలు, చతురస్రాలు, కోణాలు తదితర గణిత అంశాలను విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవంలోకి తీసుకొచ్చారు.

గణిత క్లబ్‌తో బోధన వినూత్నం

గత ప్రభుత్వ ఆదేశాల మేరకు హైస్కూల్లో గణిత క్లబ్‌ను విద్యార్థులతో ఏర్పాటు చేశారు. వాటికి కార్యవర్గాన్ని కూడా నియమించారు. ఈ క్లబ్ ద్వారా విద్యార్థులకు వినూత్నంగా గణిత బోధన సాగిస్తున్నారు. ప్రాథమిక తరగతుల నుంచి ఉన్నత తరగతుల వరకు గణిత అంశాలను సులభంగా అర్థం చేసుకునేలా నమూనాలు, ఆటపాటలు, నృత్యాలు, స్కిట్ల ద్వారా నేర్పుతున్నారు. దీంతో ఒకసారి వీటిని వంటబట్టించుకున్న విద్యార్థులు జీవితంలో మర్చిపోలేరని టీచర్లు చెప్తున్నారు. అందులో భాగంగానే తాజా ఫీల్డ్ విజిట్లో దీర్ఘ చతురస్రం, చతురస్రాకారాల్లో ఉన్న పంట పొలాలను టేపు ఆధారంగా వాటి చుట్టు కొలత, సెంట్లు, ఎకరాల లెక్కింపు తదితర విషయాలను అక్కడే రేఖా చిత్ర రూపంలో వివరించారు. తరగతి గదిలోనే కాకుండా క్షేత్ర స్థాయిలో కూడా ఎక్కడా లేని విధంగా తమకు గణితం పట్ల అవగాహన పెంచడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల కృషిని తల్లిదండ్రులు కూడా ప్రశంసిస్తున్నారు.



పాఠశాలలో గణిత నమూనాలపై ప్రత్యేక పద్ధతిలో విద్యార్థులకు బోధన



ఆట, పాటల ద్వారా గణితం బోధిస్తున్న మూర్తి

ఆనందంగా ఉంది



ఇప్పటి వరకు స్కూల్లో బోర్డు మీద మ్యాథ్స్ లెసన్స్ నేర్చుకున్నాం. మాస్టారు చెప్తుంటే వాటిని నోట్ బుక్‌లో రాసుకుని, మళ్లీ చదువుకోవడం తప్ప, ప్రాక్టికల్‌గా వాటిని తెలుసుకునే అవకాశం లేకపోయింది. ఇప్పుడు ఫీల్డ్‌లోకి తీసుకెళ్లి, మేం రోజూ చదువుకునే సిలబస్‌లోని అంశాల్నే ప్రత్యక్షంగా తెలుసుకునేలా చేశారు. చాలా ఆనందంగా ఉంది.

– పాల దుర్గాప్రసాద్, 10వ తరగతి

అవగాహన పెరిగింది



స్క్వేర్, రెక్టాంగిల్, ట్రయాంగిల్, పెరీమీటర్, రేడియస్ ఇలా మ్యాథ్స్ అంశాలను, సూత్రాలను బట్టీపట్టి, పరీక్షల్లో వాటి ఆధారంగా ప్రశ్నలకు ఆన్సర్లు రాయడమే మాకు తెలుసు. మా మ్యాథ్స్ సార్ వల్ల ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో లెక్కల వినియోగంపై పూర్తి అవగాహన కలిగింది. చుట్టూ ఉన్న పరిసరాల్ని గమనిస్తూ కూడా లెక్కలకు సంబంధించి చాలా విషయాలు నేర్చుకోవచ్చని తెలిసింది.

– అల్లు పావనిపరమేశ్వరి, 9వ తరగతి

ప్రత్యక్ష విధానంలో బోధన



గణిత క్లబ్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ రీతిలో పాఠ్యాంశాలు బోధించే ప్రయత్నం చేస్తున్నాం. ఆటలు, పాటలు, నమూనాలు, నాటికలు, నృత్యాల ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తున్నాం. అందులో భాగంగానే తాజాగా పంట పొలాలకు తీసుకెళ్లి విద్యార్థులకు గణిత అంశాల పట్ల ప్రాక్టికల్ నాలెడ్జ్, ఆసక్తి పెంచే ప్రయత్నం చేశాం. నెలకోసారి ప్రత్యక్ష విధానంలో బోధన జరపాలని భావిస్తున్నాం.

– ఏవీఎన్ మూర్తి, గణిత ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, వెదురుపర్తి

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న రంగాచారి

అనకాపల్లి: మండలంలోని 250 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశామని ఇంకా ఎవరైనా కౌలు రైతులు మిగిలిపోయి ఉంటే తక్షణమే తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, గ్రామ సర్వేయర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు, సర్వేయర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు కౌలు రైతులను తక్షణమే గుర్తించి, గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు. కార్డులందుకున్న రైతులు ఈ పంట నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మండలంలో మొత్తం 5,600 ఎకరాలకు గాను ఈ పంట నమోదు చేయాలని సూచించారు. రైతుల పంట రుణాలకు, సున్నా వడ్డీకి, రైతు భరోసాకి, విత్తనాలు, ఎరువుల సరఫరాకు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపోతే పరిహారానికి ఈ పంట నమోదు తప్పనిసరన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

అనకాపల్లి: విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, రాజా ఆప్టికల్స్ సంయుక్తంగా ఈ నెల 15న మండలంలోని ఏఎంఏఎల్ హైస్కూల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రాజా ఆప్టికల్స్ ప్రతినిధి పి.రాజా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి, ఉచిత శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి సమస్యలతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

కశింకోట: విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి సమగ్ర అవగాహన కలిగించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు సూచించారు. కశింకోట డీపీఎన్ హైస్కూల్లో గురువారం డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా నిర్వహిస్తున్న విద్యార్థుల పరిశుభ్రత కార్యక్రమంపై సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత ద్వారా 80 శాతం వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా చాలా రోగాలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. అపరిశుభ్ర చేతుల ద్వారానే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. దీనివల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. సబ్బుతో చేతుల శుభ్రతకు 7 రకాల సూత్రాలను వివరించారు. ఆహారం తీసుకునే ముందు చేతులను బాగా శుభ్రం చేసుకోవాల్సిందిగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సర్వ శిక్షా అభియాన్ ఏఎంవో మురళీమోహన్ పట్నాయక్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత గురించి పాఠశాలల్లో విద్యార్థులకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి, వారితో పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో సోప్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వీటిని విద్యార్థులు తమ పుట్టిన రోజు సమయాల్లో డొనేట్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆచంట రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న వ్యక్తి అరెస్టు

సబ్బవరం: గంజాయి కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. వివరాలు .. 2022 జూలై 14న అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై అనకపల్లి సమీపంలోని గణపతిపురం వద్ద 100 కిలోల గంజాయి,8 కిలోల లిక్విడ్ గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. జి. మాడుగుల ఏజెన్సీ ప్రాంతం నుంచి సబ్బవరం మీదుగా కేరళ తరలిస్తుండగా పట్టుబడిన గంజాయితో పాటు ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందన్నారు.ఈ కేసులో మరో ఇద్దరు వ్యక్తులు తప్పించుకుపోయారన్నారు. పరారైన 7వ వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకొని అరెస్టు చేసికోర్టుకు తరలించినట్టు చెప్పారు.

అనారోగ్యంతో సబ్బవరం ఏఎస్ఐ మృతి

దహన ఖర్చులకు రూ.10 వేల అందజేత



నగదు అందిస్తున్న ఎస్ఐ ధనుంజయ్

కె.కోటపాడు/సబ్బవరం: సబ్బవరం ఏఎస్ఐ గొర్లె రామునాయుడు(59) అనారోగ్యంతో స్వగ్రామం కె.కోటపాడు మండలం కె.జె.పురంలో బుధవారం రాత్రి మృతి చెందారు. 2021లో బదిలీపై సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం క్యాన్సర్ సోకడంతో కొంత కాలంగా చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మరణించారు. గురువారం అతడి మృతదేహానికి పూలమాల వేసి సబ్బవరం ఎస్ఐ ఆర్.ధనుంజయ్ నివాళులర్పించారు. పోలీస్ లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి దహన ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

పీఏసీఎస్ సభ్యుల వివరాలు కంప్యూటరీకరణ

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(అన్నపూర్ణ బ్యాంక్)లో ప్రభుత్వ ఆదేశాల మేరకు కంప్యూటరీకరణ నేపథ్యంలో సభ్యత్వం కలిగిన రైతులు ఆధార్ జెరాక్స్, మొబైల్ నంబరు సంఘం కార్యాలయంలో అందించాలని కార్యాలయ అఫీషియల్ ఇన్‌చార్జి వీవీ సత్యకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు తమ వివరాలను అప్‌డేట్ చేసుకుని బ్యాంక్ అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరారు.

తుమ్మపాల: మండలంలో సీహెచ్ఎన్ అగ్రహారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కంప్యూటరీకరణలో భాగంగా సభ్యులందరు తమ అకౌంట్లకు సంబంధించి వివరాలు అందించాలని సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఐవీ.రమణమూర్తి, సీఈవో సీహెచ్ మధుసూదనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు తమ ఆధార్ జెరాక్స్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా సమర్పించాలని పేర్కొన్నారు.



అన్నపూర్ణ బ్యాంక్

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులంతా కంప్యూటరీకరణలో భాగంగా తమ వివరాలను అందజేయాలని సీఈవో నక్కా అచ్చియ్యనాయుడు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ప్రతి సభ్యుడు తమ ఆధార్ జెరాక్స్‌తోపాటు సెల్ నంబర్‌ను పీఏసీఎస్‌లో అందించాలన్నారు.

ఏకగ్రీవంగా సర్పంచ్‌ల సంఘం ఎన్నిక

ఎస్.రాయవరం : మండలంలో సర్పంచ్‌ల సంఘం ఎన్నిక గురువారం మండల సర్పంచ్‌లు వమ్మవరం చినగమ్ములూరు వేదికగా నిర్వహించారు. ఓ ప్రయివేటు తోటలో మండల సర్పంచ్‌లంతా సమావేశమై ఎన్నిక నిర్వహించారు. ఇందులో తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దీంతో రెండో దఫా అధ్యక్షుడిగా ఆయన ఎంపికయ్యారు.

ప్రధాన కార్యదర్శిగా కోశెట్టి వెంకటరమణ, కార్యదర్శిగా మైలపల్లి శ్రీను, సహాయ కార్యదర్శిగా శానాపతి శ్రీరాములు, కోశాధికారిగా వైబోయిన పద్మ, సహాయ కార్యదర్శులు పాలపర్తి పాపారావు, ఉద్దండ నాగశ్రీదేవి, సభ్యులుగా ధూళి శ్రీనివాస్, కురందాస్ గణేష్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాద్రి యాదవ్, తోటి సర్పంచ్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.



ఎస్.రాయవరం మండల సర్పంచ్‌ల సంఘ నూతన కార్యవర్గం

17న ఎస్ఎంసీ ఎన్నికలు

కశింకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 17న కమిటీ ఎన్నికలు జరిపేందుకు గురువారం ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతోపాటు ఓటర్ల జాబితాలను స్కూళ్లలో అందుబాటులో ఉంచారు. మండలంలో 58 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 5 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎన్నికల సందర్భంగా పాఠశాలలో తరగతుల వారీగా ముగ్గురేసి సభ్యులను ఎన్నుకోనున్నారు. మండలంలో అతి పెద్దదైన కశింకోట బాలికల హైస్కూల్లో 24 మందిని, డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో 18 మందిని ఎన్నుకోనున్నారు. చేతులెత్తే విధానం ద్వారా ఎన్నిక జరగనుంది. ఇలా ఎన్నికైన సభ్యుల నుంచి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఓటు హక్కు ఉన్న తల్లిదండ్రుల జాబితా, ఎన్నికల నోటిఫికేషన్లను స్కూళ్లలో అందుబాటులో ఉంచినట్లు ఎంఈవో–2 కేఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.



కశింకోట బాలికల హైస్కూల్లో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

ఈ పంట నమోదు పక్కాగా జరగాలి

రాంబిల్లి (యలమంచిలి): మండలంలో ఈ పంట నమోదు పక్కాగా జరిగేలా చూడాలని వ్యవసాయాధికారులు,రెవెన్యూ అధికారులకు మండల వ్యవసాయాధికారి సి.సుమంత, రాంబిల్లి డిప్యూటీ తహసీల్దార్ శేషు కోరారు. గురువారం పంచదార్ల తుఫాన్ భవనంలో వ్యవసాయ సహాయకులు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి ఈ పంట నమోదు ఏవిధంగా చేయాలనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబిల్లి మండల వ్యవసాయాధికారి సి.సుమంత, డిప్యూటీ తహసీల్దార్ శేషు మాట్లాడుతూ రాంబిల్లి మండలంలో కొత్తగా రీ సర్వే జరిగిన 11 గ్రామాల్లో ల్యాండ్ పార్సల్ నంబరు ఆధారంగా రైతుల భూమిని జియోఫెన్సింగ్ ద్వారా యాప్‌లో పంట నమోదు చేయాలని, మండలంలో 87 కౌలు రైతుల ల కార్డులకు లక్ష్యానికి అనుగణంగా 60 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం జరిగిందని డిప్యూటీ తహసీల్దార్ శేషు అన్నారు. ఈ పంట నమోదు ఏవిధంగా చేయాలనే దానిపై కంప్యూటర్ ఆన్‌లైన్‌లో అధికారులకు క్లుప్తంగా ఆమె వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలో వ్యవసాయశాఖ సహాయకులు, సిబ్బంది, రెవెన్యూ అధికారులు, వీర్వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి సుమంత

26 మద్యం బాటిళ్ల పట్టివేత

సబ్బవరం: స్థానిక మూడు రోడ్లు కూడలిలో గురువారం సాయంత్రం ఒక వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 26 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సబ్బవరం మూడు రోడ్లు కూడలిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సబ్బవరంలోని సాయినగర్ కాలనీకి చెందిన తాటిపాముల మణికంఠ అనే వ్యక్తిని మద్యంతో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.3.900 వరకూ ఉంటుందన్నారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, సిబ్బంది ఆర్‌కే నాయుడు తదితరులు ఉన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి



సత్యనారాయణ(ఫైల్)

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందాడు. సీఐ పిన్నింటి రమణ గురువారం మీడియాకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పైల సత్యనారాయణ(54) కొన్నేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ మనోవ్యథకు గురవుతున్నాడు. దీనికి ఎన్ని చోట్ల మందులు వాడినా పెద్దగా ఉపశమనం కలగలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. ఈ నొప్పిక తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. వాంతులు చేసుకుంటుండగా గుర్తించిన ఇరుగుపొరుగు వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. అతడి కుమారుడు మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

వందశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలి



ఈ-క్రాప్ నమోదుపై వీఆర్వో, వీఏవోలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి రూరల్: ఈ ఖరీఫ్ సీజన్‌లో వందశాతం ఈ–క్రాప్ నమోదు చేయాలని యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.ప్రభాకర్ సూచించారు. గురువారం ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ తాజా మార్గదర్శకాల ప్రకారం ఈ–క్రాప్ నమోదు పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. నమోదు సమయంలో సంబంధిత రైతు ఆధార్ వివరాలు, భూమి పాస్ పుస్తకంలో ఉన్న భూమి సర్వే నంబరు, సాగుదారుని వివరాలు, రైతు మొబైల్ నంబర్‌ను తనిఖీ చేసి నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియకు సంబంధించిన సందేహాలను యలమంచిలి మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహన్‌రావు నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు



వాహనాలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

నక్కపల్లి : గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జాతీయరహదారిపై వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఎస్ఐ సన్నిబాబు, స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌తో కలసి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే అన్ని వాహనాలను తనిఖీ చేశారు. కార్లు, వ్యాన్‌లు, బస్సులను సైతం పోలీసు తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారి మీదుగా గంజాయి రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు ఈ వాహనాల తనిఖీ చేయడం జరుగుతోందని చెప్పారు. గంజాయితో పాటు నిషేధిత వస్తువుల రవాణాలను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేస్తున్నామన్నారు.